శ్మశానవాటికలో ఆక్రమణలు తొలగించాలని ధర్నా

టి.నరసాపురం :మండలంలోని సంగారావుపేటకు చెందిన గ్రామస్తులు శ్మశానవాటికలో ఆక్రమణలు తొలగించాలని కోరుతూ స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ జెవి.సుబ్బారావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తరతరాలుగా తాము వినియోగించుకుంటున్న శ్మశానవాటిక ఇటీవల ఆక్రమణలకు గురైందని ఆందోళన వ్యక్తం చేశారు. శ్మశానవాటిక సర్వే చేసి ఆక్రమణలు తొలగించి గ్రామస్తులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాలడుగుల పెద్ద వెంకటేశ్వరరావు, బోగళ్ల వీర్రాజు, పాలడుగుల గోపాలరావు, బి.నాగమణి, పి.సౌదామణి, డి.జ్యోతి, ఎం.మంగ, కె.జగదాంబ పాల్గొన్నారు.



వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

నేడే జెడ్‌పి ఛైర్మన్ ఎన్నిక

ఛైర్మన్‌గా పెదపాడు జెడ్‌పిటిసి సభ్యురాలు పద్మశ్రీకి బి - ఫారం

ఇక ఎన్నిక లాంఛనమే..

జిల్లాకు దక్కిన పదవి

ప్రస్తుత ఛైర్మన్ శ్రీనివాస్ రాజీనామాతో ఎన్నిక

ప్రత్యేక సమావేశంలో ఎన్నుకునేందుకు కలెక్టర్ ఏర్పాట్లు

39 నెలలు పదవిలో ఉండనున్న కొత్త ఛైర్మన్

23 ఏళ్ల తర్వాత రెండో మహిళా జెడ్‌పి ఛైర్మన్‌గా పద్మశ్రీ



సిఇఒ రవికుమార్ నుంచి బి-ఫారం అందుకుంటున్న జెడ్‌పిటిసి సభ్యురాలు పద్మశ్రీ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఉమ్మడి జిల్లా పరిషత్ ఛైర్మన్ ఎన్నిక గురువారం ఉదయం 11 గంటలకు జరగనుంది. ఎన్నికల కమిషన్ ఆదేశాలతో గురువారం జిల్లా పరిషత్ సభ్యులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి జిల్లా కలెక్టర్ ఎన్నిక జరపనున్నారు. జెడ్‌పి నూతన ఛైర్మన్‌గా పెదపాడు జెడ్‌పిటిసి సభ్యులు గంటా పద్మశ్రీకి వైసిపి అధిష్టానం బి ఫారం ఇవ్వడంతో ఛైర్మన్ ఎన్నిక లాంఛనంగానే సాగనుంది. నూతన ఛైర్మన్ ఎన్నికకు సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. పెదపాడు నుంచి పెద్దఎత్తున మోటార్ సైకిల్ ర్యాలీగా పద్మశ్రీ జిల్లా పరిషత్‌కు సమావేశానికి రానున్నారు. 2021 ఏప్రిల్ ఎనిమిదో తేదీన జిల్లాలో జెడ్‌పిటిసి ఎన్నికలు జరిగాయి. కోవిడ్ విజృంభణ, కోర్టు కేసుల నేపథ్యంలో కౌంటింగ్ ప్రక్రియ మాత్రం దాదాపు ఏడునెలల అనంతరం సెప్టెంబర్ 19వ తేదీన జరిగింది. ఈ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 48 జెడ్‌పిటిసి స్థానాలు ఉండగా 46చోట్ల వైసిపి అభ్యర్థులే గెలిచారు. దీంతో జెడ్‌పి ఛైర్మన్ పదవి వైసిపికే దక్కింది. జిల్లాపరిషత్ ఛైర్మన్ పదవి బిసి సామాజిక తరగతికి కేటాయించారు. దీంతో ఎన్నికలకు ముందే జిల్లా పరిషత్ ఛైర్మన్ అభ్యర్థిగా యలమంచిలి జెడ్‌పిటిసి సభ్యులు కవురు శ్రీనివాస్‌ను వైసిపి ప్రకటించింది. అత్యధిక స్థానాలు వైసిపి కైవసం చేసుకోవడంతో సెప్టెంబర్ 25వ తేదీన జిల్లా ప్రథమ పౌరునిగా కవురు శ్రీనివాస్ అట్టహాసంగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈయన దాదాపు 20 నెలలు ఛైర్మన్ పదవిలో ఉన్నారు. పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నికల్లో కవురు పోటీచేసి గెలిచారు. మే 14వ తేదీన జెడ్‌పి ఛైర్మన్ పదవికి రాజీనామా చేసి 15వ తేదీన ఎంఎల్‌సిగా ప్రమాణ స్వీకారం చేశారు.

22 రోజులుగా ఛైర్మన్ పదవి ఖాళీ

జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా కవురు రాజీనామా చేసి దాదాపు 22 రోజులు గడిచింది. అప్పటి నుంచి జిల్లా పరిషత్ ఛైర్మన్ కుర్చీ ఖాళీగానే ఉండిపోయింది. జిల్లా ప్రథమపౌరుని ఎన్నికలో నిర్లక్ష్యంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. నిబంధనల ప్రకారం వెంటనే వైస్ ఛైర్మన్‌కు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించాల్సి ఉన్నప్పటికీ అది జరగలేదు. దీంతో జెడ్‌పి ఛైర్మన్ ఎన్నికపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. మీడియాలో పెద్దఎత్తున కథనాలు రావడంతో ఎన్నికల కమిషన్ దృష్టికి అధికారులు సమస్యను తీసుకువెళ్లారు. దీంతో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి గురువారం జెడ్‌పి ఛైర్మన్ ఎన్నిక నిర్వహిస్తున్నారు. జెడ్‌పి ఛైర్మన్ పదవి బిసి సామాజిక తరగతికి కేటాయించంతో అదే తరగతికి చెందిన పెదపాడు జెడ్‌పిటిసి సభ్యులు గంటా పద్మశ్రీని ఛైర్మన్‌గా వైసిపి అధిష్టానం ఎంపిక చేసింది.

నూతన ఛైర్మన్ ముందు సవాళ్లెన్నో

జెడ్‌పి నూతన ఛైర్మన్ అనేక సవాళ్లను ఎదర్కోనున్నారు. జిల్లావ్యాప్తంగా జెడ్‌పి ఆధ్వర్యంలోని రోడ్లన్నీ తీవ్రంగా దెబ్బతిన్నాయి. అనేక సమావేశాల్లో జిల్లా పరిషత్ సభ్యులు ఈ సమస్యను ప్రస్తావిస్తున్నారు. అంతేకాకుండా జిల్లా పరిషత్ పరిధిలోని దుకాణాలు, భూములకు సంంధించిన లీజుల పెండింగ్ ఎక్కువగా ఉన్నాయని చెబుతున్నారు. లీజు సొమ్ము వసూలు చేస్తే జిల్లా అభివృద్ధికి ఉపయోగపడనున్నాయి. అంతేకాక జిల్లా పరిషత్ ఆధ్వర్యంలో చేపట్టే వివిధ పనులకు సంబంధించి నిధులు కేటాయింపులు జరగాల్సి ఉంది. ముఖ్యంగా జిల్లా పరిషత్ కార్యాలయంలో అధికారుల తీరు ఇష్టారాజ్యంగా మారిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జెడ్‌పిటిసి సభ్యులకు కనీస గౌరవం ఇవ్వడం లేదంటూ గగ్గోలు పెడుతున్నారు. దీనిపై నూతన ఛైర్మన్ ప్రధానంగా దృష్టిసారించాల్సి ఉంది.

బిసి సామాజిక తరగతికి చెందిన జెడ్‌పిటిసిలు తొమ్మిది మంది ఉన్నప్పటికీ ఆదినుంచి పద్మశ్రీ పేరునే ప్రముఖంగా వినిపించింది. అదే సమయంలో మహిళాకు పెద్దపీట వేస్తున్నట్లు సైతం పార్టీ అధిష్టానం ప్రకటించింది.

చక్రం తిప్పిన అబ్బాయిచౌదరి

జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా పెదపాడు జెడ్‌పిటిసి ఎంపిక కావడంలో దెందులూరు ఎంఎల్‌ఎ అబ్బయ్య చౌదరి కీలకంగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. అన్ని పదవులు విభజిత పశ్చిమగోదావరి జిల్లా నాయకులకు వెళ్లడంతో ఛైర్మన్ పదవి ఏలూరు జిల్లాకు ఇవ్వాలని ఆయన గట్టి పట్టుపట్టినట్లు సమాచారం. అంతేకాకుండా ఆయన నియోజకవర్గమైన పెదపాడు జెడ్‌పిటిసిని ఛైర్మన్ చేసేందుకు తీవ్రంగా కృషిచేసినట్లు తెలిసింది. ఏలూరు జిల్లాలో బలమైన అభ్యర్థిగా ఉన్న పద్మశ్రీని అధిష్టానం ఎంపిక చేసింది. ఛైర్మన్‌గా ఎంపిక చేస్తూ బిఫారం కూడా ఇవ్వడంతో ఎన్నిక లాంఛనమే అని చెప్పొచ్చు. కొత్తగా ఛైర్మన్ బాధ్యతలు చేపట్టనున్న పద్మశ్రీ ఇంకా మూడేళ్లకు పైగా ఈపదవిలో ఉండనున్నారు. అనూహ్యంగా ఛైర్మన్ పదవి వరించడంతో పద్మశ్రీ అనుయాయులు, పార్టీ కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రెండో మహిళా జెడ్‌పి ఛైర్మన్‌గా పద్మశ్రీ

1936లో జిల్లా పరిషత్ ఏర్పాటు నుంచి ఇప్పటి వరకూ 21 మంది ఛైర్మన్లుగా పనిచేశారు. నూతన ఛైర్మన్‌గా ఎన్నిక కానున్న గంటా పద్మశ్రీ 22వ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. అంతేకాక ఇప్పటి వరకూ జెడ్‌పి ఛైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించిన మహిళ ఒక్కరే. 1995 నుంచి 2000 సంవత్సరం వరకూ ఇమ్మణి రాజేశ్వరి ఛైర్మన్‌గా ఉన్నారు. అంతకు ముందుగానీ, తర్వాత గానీ జెడ్‌పి ఛైర్మన్‌గా మహిళలు ఎవరూ ఎన్నిక కాలేదు. నూతనంగా ఎన్నిక కానున్న పద్మశ్రీ రెండో జెడ్‌పి మహిళా ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు.

పోలవరం నిర్వాసితుల సమస్యలపై

20 నుంచి 'పోరుకేక'

అల్లూరి జిల్లా నెల్లిపాక నుంచి విజయవాడ వరకూ మహాపాదయాత్ర

17 రోజులు.. 400 కిలోమీటర్ల సాగనున్న యాత్ర

నిర్వాసితులకు పూర్తిపరిహారం సాధనే ధ్యేయం

విలేకరుల సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

సమావేశంలో మాట్లాడుతున్న ఎ.రవి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన ఈనెల 20వ తేదీ నుంచి అల్లూరి సీతారామరాజు జిల్లా నెల్లిపాక నుంచి విజయవాడ వరకూ పోరుకేక (మహాపాదయాత్ర) నిర్వహిస్తున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి తెలిపారు. ఈ సందర్భంగా ఏలూరులోని సిపిఎం జిల్లా కార్యాలయం (ఉద్దరాజురామం భవనం)లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.కిషోర్, జిల్లా కమిటీ సభ్యులు బి.సోమయ్య, కె.శ్రీనివాస్‌తో కలిపి ఆయన మాట్లాడారు. నిర్వాసితుల త్యాగాలు, పునాదులపై పోలవరం ప్రాజెక్టు నిర్మిస్తున్నామని ప్రగల్భాలు పలకడం తప్ప ఈ పాలకులకు పునరావాసం పట్టడం లేదన్నారు. జాతీయ ప్రాజెక్టు అయినప్పటికీ కేంద్రం పునరావాసం తమకు సంబంధం లేదని ఖరాఖండీగా ప్రకటించిందని, రాష్ట్ర ప్రభుత్వానికి వరద ముంపు సహాయ చర్యలు, పునరావాస చర్యల పట్ల శ్రద్ధ లేదని విమర్శించారు. ప్రాజెక్టు ప్రారంభించి 15 ఏళ్లయినా పునరావాసం పది శాతం మించలేదని తెలిపారు. కేంద్రం ఈనెల ఆరో తేదీన నిధులు విడుదలకు సంబంధించి ప్రకటన చేసినా పునరావాసానికి నిధులివ్వలేదని, ముఖ్యమంత్రి జగన్ పర్యటనలోనూ పునరావాసంపై ప్రకటన లేదని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అటకెక్కించారని విమర్శించారు. ఈ నేపథ్యంలో ఈ మహా పాదయాత్ర తలపెట్టామని వివరించారు. ఈనెల 20న ప్రారంభమై జూలై ఏడు వరకూ సాగుతుందన్నారు.

ఈనెల 26న ఏలూరు జిల్లాలోకి వేలేరుపాడు మండలం రుద్రంకోట వద్ద ప్రవేశిస్తుందన్నారు. ఈ యాత్ర జిల్లాలో వేలేరుపాడు, కుక్కునూరు, జీలుగుమిల్లి, బుట్టాయగూడెం, జంగారెడ్డిగూడెం మండలాల్లోని నిర్వాసిత ప్రాంతాలు, కాలనీల్లో పర్యటిస్తుందన్నారు. ఏలూరు మీదుగా విజయవాడ చేరుకుంటుదని తెలిపారు. దీంతోపాటు పోలవరం నుండి బుట్టాయగూడెం వరకు మరో ఉపయాత్ర రెండు రోజులపాటు నిర్వహించి ఈ ప్రధానయాత్రలో కలుస్తుందని చెప్పారు. 400 కిలోమీటర్లు వరకూ సాగే ఈ యాత్రకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు నేతృత్వం వహిస్తారని, ఇందులో నెల్లిపాక నుండి విజయవాడ వరకూ 17 రోజులపాటు 500 మందికిపైగా నడుస్తారని తెలిపారు. ఈ యాత్రలో ఆయా గ్రామస్తులు, నిర్వాసితులు, వివిధ పార్టీల నాయకులు, ప్రజాసంఘాల నేతలు, కార్యకర్తలు కూడా కలుస్తారని పేర్కొన్నారు.

పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్లడంతో పాటు వివిధ రాజకీయ పార్టీలు, ప్రజలందరి దృష్టికి తెచ్చి పరిష్కారానికి అందరి మద్దతును కూడగట్టేందుకు ఈ యాత్రను సిపిఎం నిర్వహిస్తుందని స్పష్టం చేశారు. నిర్వాసితుల డిమాండ్లు సాధించే వరకూ పోరుకేక మహా పాదయాత్రతోపాటు అన్ని రూపాల్లో పోరాడతామని తెలిపారు. ఈ యాత్రకు వివిధ పార్టీలు, ప్రజాసంఘాలు, నిర్వాసితులు, ప్రజలు అందరూ అన్ని విధాలా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

పోరు కేక డిమాండ్లు ఇవే..

- పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం పునరావాసం, పరిహారం ఇవ్వాలి. గోదావరి వరదల నుండి రక్షణకు ప్రభుత్వాలు ముందస్తు సహాయక చర్యలు చేపట్టాలని, గత ఏడాది వరదల్లో నష్టపోయిన వారికి పరిహారం, పునరావాసం చెల్లించాలి. తప్పుల తడకగా ఉన్న కాంటూరు లెక్కలు మార్చాలి. పూర్తి పరిహారం చెల్లించే వరకూ గ్రామాలు ఖాళీ చేయించరాదు.
- పునరావాసం పూర్తయ్యే వరకూ ముంపు గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు యథావిధిగా కొనసాగించాలి.
- 1986, 2022 నాటి వరద ముంపు ఆధారంగా గ్రామాల రీసర్వే చేయాలి. పునరావాసం దశల వారీగా కాకుండా ఏక కాలంలో అన్ని గ్రామాల్లో పూర్తి చేయాలి.
- మండలాన్ని యూనిట్‌గా తీసుకుని ఆర్‌అండ్ఆర్ పరిహారం అర్హులందరికీ ఇవ్వాలి.
- ముంపు మండలాల్లో ప్రభుత్వం స్వాధీనం చేసుకునే ప్రతీ ఎకరాకు రూ.20 లక్షలు చెల్లించాలి.
- ముఖ్యమంత్రి జగన్ అసెంబ్లీలో ఇచ్చిన హామీ మేరకు ప్రతి నిర్వాసిత కుటుంబానికి కాంటూరు లెక్కలతో సంబంధం లేకుండా రూ.10.50 లక్షలు పరిహారం ఇవ్వాలి.
- గ్రామాలు ఖాళీ చేయించే నాటికి 18 సంవత్సరాలు పూర్తయిన యువతకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇవ్వాలి.
- సర్వం కోల్పోతున్న ప్రతి నిర్వాసిత కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలి.
- ముంపు ప్రాంతాల ఉద్యోగులను యథాతథంగా తరలించే ప్రాంతాల్లో కొనసాగించాలి.

స్టార్ డెంటల్ సౌజన్యంతో ఆర్‌టిసి బస్సులకు

ఫస్ట్‌ఎయిడ్ బాక్సులు అందజేత

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఎపిఎస్ ఆర్‌టిసి బస్సుల్లో నిరంతరం అవసరమయ్యే 150 ఫస్ట్ ఎయిడ్ బాక్స్‌లను బుధవారం ఏలూరుకు చెందిన ప్రముఖ స్టార్ దంత వైద్యశాల వారు ఏలూరు జిల్లా రవాణా అధికారికి అందించారు. ఈ సందర్భంగా స్టార్ డెంటల్ అధినేత డాక్టర్ ఎస్.శ్రీహర్ష మాట్లాడుతూ తమ సంస్థ స్థాపించి పదేళ్ల పూర్తయిన సందర్భంగా వివిధ సేవలందిస్తున్నామని, అందులో భాగంగా ఆర్‌టిసి బస్సులో ప్రయాణికులకు ప్రమాద సమయంలో అవసరమైన ఫస్ట్ ఎయిడ్ బాక్స్‌లు అందించామన్నారు. తమ సంస్థలో ప్రభుత్వ ఉద్యోగులకు ఇహెచ్‌ఎస్ సౌకర్యం కూడా కలదని, ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఏలూరు జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి ఎన్‌విఆర్.వరప్రసాద్ మాట్లాడుతూ ఈ మెడికల్ కిట్లు అందించడం సంతోషదాయకమన్నారు. అదేవిధంగా జూన్ 12వ తేదీ నుండి పాఠశాలలు తెరుస్తున్నారని, విద్యార్థులకు నెలవారీ సీజన్ బస్సు పాసులు ఉదయం ఎనిమిది గంటల నుండి సాయంత్రం ఆరుగంటల వరకూ ఏలూరు జిల్లావ్యాప్తంగా ఉన్న అన్ని బస్‌స్టేషన్‌లలో అందజేస్తారని, ఈ అవకాశాన్ని విద్యార్థులు ఉపయోగించుకోవాలని తెలిపారు. ఏలూరు జిల్లా నుండి విశాఖపట్నం వరకూ ప్రతీ శనివారం రాత్రి విశాఖ సందర్శనకు బస్సులు ఏర్పాటు చేస్తున్నామని, తమ కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా ఒకరోజు విహారయాత్ర చేసి రావొచ్చని, ప్రతిపౌర్ణమికి అరుణాచలం యాత్ర స్పెషల్ సర్వీసును ప్రజలు బాగా ఆదరిస్తున్నారని, ఈ సర్వీసు నిరంతరం కొనసాగుతుందని తెలియజేశారు .



ఫస్ట్‌ఎయిడ్ బాక్కులు అందిస్తున్న డాక్టర్ శ్రీహర్ష

9 వరకూ మొక్కజొన్న కొనుగోలు పెంపు

ప్రజాశక్తి - ఏలూరు

ఎపి మార్క్ ఫెడ్ ద్వారా చేపట్టిన మొక్కజొన్న కొనుగోలును ఈనెల తొమ్మిదో తేదీ వరకూ పొడిగించామని జిల్లా వ్యవసాయశాఖ జెడి వై.రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతు భరోసా కేంద్రం పరిధిలో రిజిస్ట్రేషన్ చేయించుకున్న రైతులు ఇంకా ఉంటే వెంటనే రైతు భరోసా కేంద్రం మ్యాప్ చేసిన సెంటర్లకు వెళ్లి మొక్కజొన్న పంటను విక్రయించుకోవాలని తెలిపారు. ఈనెల తొమ్మిదో తేదీ తర్వాత ప్రభుత్వం ఎలాంటి పొడగింపునూ ఇవ్వదని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని రైతులను ఆయన కోరారు.

సక్రమంగా నిత్యావసర వస్తువుల సరఫరా

ప్రజాశక్తి - ముదినేపల్లి

ప్రభుత్వ ఎండియు వాహనం ద్వారా సరఫరా చేసే నిత్యావసర వస్తువులు వణుదుర్రు దళితవాడకు సక్రమంగా అందడంలేదంటూ, బయోమెట్రిక్ ఫెయిల్ అయిన లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేయడం లేదంటూ, దీంతో దళితవాడ ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నట్లు మండల వ్యవసాయ కార్మిక సంఘం చిన్నం మాధవ ఏలూరులో జరిగిన స్పందనలో అర్జీలు సమర్పించారు. అర్జీలపై సంబంధిత అధికారులు స్పందించి మాధవకు బుధవారం గ్రామ విఆర్‌ఒ నరసింహారావు ద్వారా ఎండార్సుమెంట్ ఇస్తూ ఇకనుంచి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా బియ్యం, నిత్యావసర సరుకులు అందిస్తామన్నారు. బయోమెట్రిక్ ఫెయిల్ అయిన లబ్ధిదారులకు ఎండియు ఆపరేటర్‌కు జూన్ నుంచి ఐరిస్ మెషిన్ సదుపాయం కల్పించినట్లు తెలిపారు. బియ్యం సజావుగా పంపిణీ చేస్తామని, ఎండియు ఆపరేటర్ ద్వారా కందిపప్పు, పంచదార, బియ్యం సక్రమంగా అందిస్తామని ఎండార్సుమెంట్ ద్వారా మాధవకు తెలిపారు.

మెడికల్ కళాశాల నిర్మాణ పనులు వేగవంతం

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలరు

ఏలూరు ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిని వైద్య కళాశాలగా మార్పుచేసేందుకు చేపట్టిన నిర్మాణ పనుల త్వరితగతిన పూర్తిచేయాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం రాష్ట్ర ప్రభుత్వ ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రూ.ఐదు కోట్లతో ఏలూరు జిల్లా ప్రధాన ప్రభుత్వాసుపత్రిని వైద్య కళాశాలగా మార్పుచేసేందుకు చేపడుతున్న నిర్మాణ పనుల పురోగతిని కలెక్టర్ పరిశీలించారు. ఈ పరిశీలనలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయ ఆవరణలో, ప్రధాన ప్రభుత్వ ఆసుపత్రిలో రాబోయే అకాడమిక్ సంవత్సరం (2023-24) ఆగస్టు ఒకటో తేదీ నుండి ఎంబిబిఎస్ మొదటి సంవత్సరం విద్యార్థులకు తరగతులు ప్రారంభిస్తున్న దృష్ట్యా యుద్ధప్రాతిపదికన మెడికల్ కాలేజీ, హాస్టళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. అదే విధంగా మెడికల్ కాలేజీ నిర్మాణ పనుల, ప్రగతిపై కలెక్టర్ ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. మెడికల్ విద్యార్థుల హాస్టళ్లలో ఏర్పాటు చేయాల్సిన మౌలిక సదుపాయాలు, ట్రాన్స్‌పోర్ట్ గురించి కలెక్టర్ అధికారులతో చర్చించి, తగు సూచనలు చేశారు. ఈ పర్యటనలో డిఎంహెచ్‌ఒ కార్యాలయంలో నిర్మిస్తున్న ఎంబిబిఎస్ మొదటి సంవత్సరం క్లాస్ రూములు, నిర్మాణ పనులు, ఏటిగట్టులో హాస్టల్ నిర్మాణానికి సంబంధించిన భూమిని పరిశీలించారు. అలాగే జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో ఉన్న నర్సింగ్ విద్యార్థులు, హాస్టళ్లకు సంబంధించి సిఎస్ఐ స్కూలును కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎపిఎంఎస్ఐసిడిసి ఇఇ రాజాబాబు, ఆర్‌డిఒ కె.పెంచల కిషోర్, తహశీల్దారు సోమశేఖర్, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనరు ఎస్.వెంకటకృష్ణ, డిఐఒ నాగేశ్వరరావు, జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎవి.మోహన్, ఎంహెచ్ఒ మాలతి, సోషల్ వెల్ఫేర్ జెడి జెవి.ప్రకాష్, డిప్యూటీ మున్సిపల్ కమిషనరు రాధ, హౌసింగ్ పిడి ఇన్‌ఛార్జి నరసింహారావు పాల్గొన్నారు.

నిర్మాణ పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రసన్నవెంకటేష్

నేడు నూజివీడు మున్సిపల్ వైస్ ఛైర్మన్ ఎన్నిక

నూజివీడు రూరల్ :నూజివీడు మున్సిపాలిటీ వైస్ ఛైర్మన్ ఎన్నికను ఈ నెల 8వ తేదీన నిర్వహించేందుకు మున్సిపల్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటివరకు వైస్ ఛైర్మన్‌గా ఉన్న అమీరున్నీసా బేగం తన పదవికి రాజీనామా చేయడంతో ఎన్నిక అనివార్యమైనది. రిటర్నింగ్ అధికారిగా స్థానిక సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్‌ను నియమిస్తూ ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది. రేపు ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో ఎన్నికను నిర్వహించనున్నారు.

పట్టెన్నపాలెం బ్రిడ్జి నిర్మించాలని టిడిపి జలదీక్ష

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మండలంలోని పట్టెన్నపాలెం వద్ద జల్లేరు వాగుపై అసంపూర్తిగా నిర్మించిన బ్రిడ్జిని వెంటనే పూర్తిస్థాయిలో నిర్మించాలని టిడిపి నాయకులు బొరగం శ్రీనివాసులు, డాక్టర్ దాసరి శ్యామ్ చంద్ర శేషు డిమాండ్ చేశారు. బుధవారం అసంపూర్తిగా ఉన్న పట్టెన్నపాలెం జల్లేరు వాగు వద్ద టిడిపి నేతలు జలదీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా టిడిపి పోలవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొరగం శ్రీనివాస్ మాట్లాడుతూ ఏజెన్సీలో కొలువై ఉన్న గుబ్బల మంగమ్మ తల్లి ఆలయానికి వెళ్లే దారితో పాటు పోలవరం ముంపు ప్రాంతాలైన వేలేరుపాడు కుక్కునూరు మండలాల ప్రజలకు ప్రధాన రహదారి అయిన పట్టెన్నపాలెం వద్ద వంతెన నిర్మాణం గత ఐదు సంవత్సరాలుగా నిలిచిపోయిందన్నారు. ఈ వంతెనను వెంటనే నిర్మించాలని డిమాండ్ చేశారు. ఐటిడిఎ పరిధిలో నిధులు ఉన్నప్పటికీ ప్రభుత్వం ఏజెన్సీ వాసులపై తీవ్ర నిర్లక్ష్యం కనపరచడం బాధాకరమన్నారు. టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ దాసరి శ్యామ్ చంద్ర శేషు మాట్లాడుతూ ఈ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని ఇప్పటికి మూడు సార్లు స్పందన, మూడు సార్లు జగనన్నకు చెబుదాం 1902 నెంబర్‌కు ఫిర్యాదు చేశామని తెలిపారు. ఫిర్యాదు చేసిన ప్రతిసారి సంబంధిత అధికారులు టెండర్ ఓపెన్‌లో ఉంది ఎవరైనా కాంట్రాక్టర్లు ముందుకు వస్తే పూర్తి చేస్తామని బదులు ఇవ్వడం హాస్యాస్పదంగా ఉందన్నారు. బ్రిడ్జి నిర్మాణం కోసం రూ.నాలుగు కోట్లు, డైవర్షన్ రోడ్డు కోసం మరో రూ.40 లక్షల నిధులు ఉన్నాగాని ప్రభుత్వం ముందుకు రాకపోవడం దురదృష్టకరమని విమర్శించారు. గుత్తేదారులు రాకపోతే ప్రభుత్వమే సత్వర నిర్మాణ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని వెంటనే వంతెన నిర్మాణ పనులు చేపట్టకపోతే ఈ ప్రాంత ప్రజలతో కలిసి పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి చిట్టిబోయిన రామలింగేశ్వరరావు, జంగారెడ్డిగూడెం మండల ఎస్‌సి సెల్ అధ్యక్షుడు గొల్లమండల్ శ్రీనివాస్, అధికార ప్రతినిధి తాళ్లూరి వెంకటేశ్వరరావు, మద్రి రమేష్ పాల్గొన్నారు.

జలదీక్ష చేస్తున్న టిడిపి నేతలు

మినీ మేనిఫెస్టో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న టిడిపి నేతలు

టిడిపి మినీ మేనిఫెస్టోపై నేతల సమీక్ష

ప్రజాశక్తి - భీమడోలు

తెలుగుదేశం పార్టీకి చెందిన వివిధ విభాగాల నాయకులు తరచూ గ్రామస్థాయిలో పర్యటించి పార్టీ పనితీరు, రానున్న కాలంలో పార్టీ చేపట్టబోయే వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు గురించి ప్రజలకు వివరించాలని ఆ పార్టీ ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు కోరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో టిడిపి ఉంగుటూరు నియోజకవర్గ స్థాయి విస్తృత సమావేశం బుధవారం ఆయన అధ్యక్షతన జరిగింది. సమావేశం ప్రారంభం కాగానే ఒడిశా రైలు ప్రమాద మృతులకు రెండు నిమిషాలపాటు మౌనం పాటించి నివాళులర్పించారు. ఆ తరువాత భవిష్యత్తు గ్యారంటీ పేద టిడిపి విడుదల చేసిన మినీ మేనిఫెస్టో గోడ పత్రికను ఆవిష్కరించారు. అనంతరం కొనసాగిన సమావేశంలో గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ మినీ మేనిఫెస్టోలోని అంశాల వారీగా ప్రాధాన్యతలను వివరించారు. వీటిపై కార్యకర్తలతో చర్చించారు. మినీ మేనిఫెస్టోలోని అంశాలను కిందస్థాయి వరకూ తెలియజేసేందుకు కార్యకర్తలకు దశా, దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని వివిధ మండల శాఖల అధ్యక్షులు సిరిబత్తిన కొండబాబు, ముత్యాల వెంకటేశ్వరరావు, ఇందుకూరి రామకృష్ణం రాజు, మాజీ జెడ్‌పిటిసి సభ్యులు కె.పెద్దిరాజు, ఎఎంసి మాజీ ఛైర్మన్ డి.పుల్లయ్య పాల్గొన్నారు.

పోలవరంలో భారీ అగ్ని ప్రమాదం

మంటల ధాటికి పేలిన గ్యాస్ సిలిండర్లు

మూడు తాటాకిళ్లు, రెండు మాంసం దుకాణాలు, మేకల దొడ్డి దగ్ధం

వంద కోళ్లు అగ్నికి ఆహుతి

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం పంచాయతీ ఎడ్లగూడెం గ్రామం వద్ద బుధవారం భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఈ అగ్ని ప్రమాదంలో రోడ్డు పక్కన ఉన్న రెండు కోడి మాంసం దుకాణాలు, ఒక మేకల దొడ్డి దగ్ధమయ్యాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మూడు తాటాకిళ్లు దగ్ధమయ్యాయని స్థానికులు చెబుతున్నారు. గాలి తీవ్రత తక్కువగా ఉండడంతో పెను ప్రమాదమే తప్పిందని చెప్పారు. మంటలకు కోడి మాంసం దుకాణంలో ఉన్న రెండు గ్యాస్ సిలిండర్లు పేలడంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. కోడి మాంసం దుకాణంలో ఉన్న సుమారు వంద కోళ్లు అగ్నికి అహుతయ్యాయి. పొడుం శ్యామ్ కుమార్,అక్కబత్తుల రాజు, స్థానిక ప్రజల సహకారంతో మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించినప్పటికీ అధిక ఉష్ణోగ్రత వేడి గాలుల కారణంగా మూడు పాకలు పూర్తిగా కాలిపోయాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఆ ప్రాంతానికి పోలవరం ఎంపిపి సుంకర వెంకట రెడ్డి, సర్పంచి పొడుం పుష్ప, గుణపర్తి చిన్ని, ఎలక్ట్రికల్ సిబ్బంది చేరుకుని పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.

దగ్ధమవుతున్న తాటాకిళ్లు

వ్యాన్ ఢీకొని ప్రజాశక్తి విలేకరికి గాయాలు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

జీలుగుమిల్లి ప్రజాశక్తి విలేకరి నక్కా రవికుమార్‌కు రోడ్డు ప్రమాదంలో గాయాలయ్యాయి. జీలుగుమిల్లి ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం ఉన్నాయి. బుధవారం ఉదయం రవికుమార్ స్వగ్రామం లక్ష్మీపురంలోని ఇంటి నుంచి వాకింగ్ చేస్తూ తట్టాడ దేవరపల్లి రహదారి మార్జిన్‌లో నడుస్తున్నారు. ఈ క్రమంలో రవికుమార్ లక్ష్మీపురం సెంటర్ వద్ద అప్పలరాజుగూడెం వైపు వెళ్తుండగా ప్రయత్నించగా వెనుక నుంచి వచ్చిన ఐసర్ వ్యాన్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కిందపడిపోయిన రవికుమార్ తలకు గాయమైంది. ఇది గమనించిన స్థానికులు రవిని వెంటనే జంగారెడ్డిగూడెంలో ఓ ప్రయివేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం ఏలూరుకు తీసుకెళ్లాలని సూచించారు. రవికుమార్ తలకు అయిన గాయం వల్ల తలలో రక్తం గడ్డ కట్టిందని వైద్యులు నిర్ధారించారు. రెండు రోజుల పాటు ఐసియులో ఉంచి పరిశీలిస్తున్నట్లు సమాచారం. దీనిపై దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చంద్ర శేఖర్ తెలిపారు.

కౌలు రైతుల యాత్ర జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - భీమడోలు

కౌలు రైతుల రాష్ట్ర యాత్రను విజయవంతం చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరారు. స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో బుధవారం కౌలు రైతుల రాష్ట్ర యాత్ర పోస్టర్లను ఎపి కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శితో పాటు సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు, కౌలు రైతుల సంఘం జిల్లా కో-కన్వీనర్ వెజ్జు శ్రీరామచంద్రమూర్తి రైతు సంఘం సీనియర్ నాయకులు జి.ప్రసాదరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూ యజమానుల ఒప్పంద పత్రంతో నిమిత్తం లేకుండా కౌలు రైతులందరికి గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. పంట సాగు చేస్తున్న కౌలు రైతులకు పంట రుణాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఈ రాష్ట్ర యాత్ర కొనసాగనుందని రూరల్ గురించి వివరిస్తూ ఈ నెల పదో తేదీన కౌలు రైతుల రాష్ట్ర యాత్ర నిడమర్రు మండలం భువనపల్లి వద్ద ప్రారంభమై ఉంగుటూరు, భీమడోలు, దెందులూరు మండలాల మీదుగా ఏలూరు చేరుకుంటుందని వివరించారు.



పొలసానిపల్లిలో కౌలు రైతు కార్డులు పంపిణీ చేస్తున్న గ్రామ సర్పంచి

కౌలు రైతు కార్డులను వినియోగించుకోండి

ప్రజాశక్తి - భీమడోలు

బహుళ ప్రయోజనకారిగా గుర్తింపు పొందిన కౌలు రైతు కార్డుల సేవలను వినియోగించుకోవాలని పొలసానిపల్లి గ్రామ సర్పంచి షేక్ రహీమా బేగం హసేన కోరారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం కౌలు రైతు కార్డుల పంపిణీ కార్యక్రమం, గ్రామంలో అమలవుతున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక ఎంపిటిసి సభ్యులు ఎ.దేవీనాగేంద్రప్రసాద్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన గ్రామ సర్పంచి మాట్లాడుతూ పొలసానిపల్లి గ్రామానికి 2023-24 ఖరీఫ్ సీజన్‌కు 186 కౌలు రైతు కార్డులు మంజూరయ్యాయన్నారు. వీటి పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించామని తెలిపారు. ఆ తర్వాత గ్రామంలో అమలవుతున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై గ్రామ సచివాలయ సిబ్బంది, వాలంటీర్లతో సమావేశమయ్యారు. వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు. వైఎస్ఆర్ బీమా పథకంలో అర్హులైన వారు నూరు శాతం నమోదయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారి సింహాచలం, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ రమేష్ పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలో విద్యార్థులు

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి - నిడమర్రు

నిడమర్రు శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా బుధవారం 40 మంది విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంతో డిజిటల్ గ్రంథాలయాలు అంశంపై వారి అభిప్రాయాన్ని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని గ్రంథాలయ పాలకులు బాలరాజు పర్యవేక్షించారు.

వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచి వెంకటేశ్వరరావు

పంగిడిగూడెంలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

గ్రామ ప్రాంతాల్లో ఏర్పాటు చేసే ఉచిత వైద్య శిబిరం సేవలను సద్వినియోగం చేసుకోవాలని పంగిడిగూడెం గ్రామ సర్పంచి కోట వెంకటేశ్వరావు అన్నారు. మండలంలోని పగిడిగూడెంలో అమ్మ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో విజయవాడ కామినేని హాస్పిటల్, ఏలూరు శంకర నేత్రాలయ హాస్పిటల్, జంగారెడ్డిగూడెం రామచంద్ర కంటి హాస్పిటల్ సౌజన్యంతో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని పంగిడిగూడెం గ్రామ సర్పంచి కోట వెంకటేశ్వరరావు ప్రారంభించారు. అలాగే కార్డియాలజీ విభాగాన్ని ఉప సర్పంచి పి.సురేష్‌రెడ్డి ప్రారంభించారు. గైనకాలజీ విభాగాన్ని మురళీకృష్ణరెడ్డి ప్రారంభించారు. జనరల్ విభాగాన్ని రవిచంద్ర రెడ్డి ప్రారంభించారు. ఈ శిబిరానికి సుమారు 369 మంది హాజరయ్యారు. 36 మందికి కంటి ఆపరేషన్లకు ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో స్థానిక ఆర్ఎంపి డాక్టర్ మాండ్రు చంద్రరావు ఆధ్వర్యంలో ఉచిత మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శిబిరం ఆర్గనైజర్ శ్రీ చిటికెల రాంబాబు వైద్యఆరోగ్య సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అమ్మ స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు కూరెళ్ల రాంబాబు, రామిశెట్టి కిషోర్, వేగవరం భాను, నెమలిగిరి చిరంజీవి, లక్కవరం బాబు, స్థానిక పంగిడిగూడెం సభ్యులు మాండ్రు చందర్రావు, ఆర్ఎంపి డాక్టర్ గద్ద తమ్మయ్య, కుంచే కుటుంబరావు, దుద్దే విజయ్, బేతాళ నాగబాబు, మాండ్రు శ్రీనివాస్, మాండ్రు సుధీర్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ఓ వైపు ఎండలు.. మరోవైపు విద్యుత్ కోతలు..!

జనం అవస్థలు

ప్రజాశక్తి - పోలవరం



రోహిణి కార్తె ప్రభావంతో ఓ వైపు మండుతున్న ఎండలు.... ఎంత వేడిమి తాళలేక ఇంట్లో ఉందామంటే ఫ్యాన్లు, ఎసిలు ఉన్నా అప్రకటిత విద్యుత్ కోతలు మరోవైపు ఉండటంతో ఉక్కపోతతో జనం అవస్థలు పడుతున్నారు. గత కొన్ని రోజులుగా వేసవి ఎండలు భగభగ మండుతుంటే పగలంతా కూలికెళ్లి కూలి కోసం బయట తిరిగి వచ్చిన ప్రజానీకానికి రాత్రులు చల్లగా ఆదమరిచి నిద్ర పోవడానికి కూడా వీలుపడని పరిస్థితులు పోలవరంలో తాండవిస్తున్నాయి. అసలే పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వల్ల సమీప ప్రాంతాల్లో ఒక చెట్టు అయినా లేకపోవడం, పర్యావరణం ఎంతో మారడం వల్ల ప్రాజెక్టు వాహనాల కాలుష్యంతో భూతాపం పెరిగి వాతావరణం వేడెక్కిపోతుంది. పగలు రాత్రి ఇదే పరిస్థితి నెలకొంటుంది. రాత్రిపూట అయినా ఆదమరిచి నిద్ర పోదామంటే అప్రకటిత విద్యుత్ కోతల వల్ల దోమలతో ఉక్కపోతతో ఆరుబయట పచార్లు చేయాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. విద్యుత్ శాఖలో సిబ్బంది కొరత వల్ల మండలంలో అన్ని ప్రాంతాల్లో సమస్యలను పరిష్కరించడంలో విద్యుత్ శాఖ నిందలు పడాల్సిన పరిస్థితులు కూడా ఎదురవుతున్నాయి. ఎండ వేడిమి ఉక్కపోత భరించలేక చిన్న పెద్ద ప్రజానీకం గోదావరిలో స్నానాలకు ఉపక్రమిస్తున్నారు. ఎండ తగ్గేవరకు గోదావరిలోనే గడుపుతున్నారు. రాత్రి 7 గంటల వరకు వాతావరణం చల్లబడదం లేదు. అసలే పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వల్ల పోలవరం నుంచి గూటాల వరకు గోదావరి నది ప్రవాహం లోతుగా ప్రమాద భరితంగా ఉండడం వల్ల తరచూ గోదావరి నదిలో స్నానానికి దిగి మృత్యువాత పడుతున్నారు. ఈ ఎండల నేపథ్యంలో గోదావరి స్నానాలకు వెళ్లే రేవులు ప్రమాద భరితంగా ఉండడం, స్నానాలకు అనువుగా లేకపోవడం వల్ల, ప్రమాదాలు ఎదురయ్యే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. ఎండ తగ్గే వరకు గోదావరిలోనే గడుపుతున్నారు. పోలీస్ అధికారులు ఎక్కడికక్కడ గోదావరి నదిలో లోతుగా ఉన్న ప్రాంతాల్లో స్నానాలకు ఉపక్రమించరాదని ప్రమాద సూచికలు ఏర్పాటు చేసినప్పటికీ ఎండ వేడిని తాళలేక ఆయా ప్రాంతాల్లోనే స్నానాలు చేస్తున్నారు.

ఉపాధి హామీ పని ప్రదేశాల్లో సౌకర్యాలు కల్పించాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జీవరత్నం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ఉపాధి హామీ పని ప్రదేశాల్లో కూలీలు వడదెబ్బకు గురికాకుండా మజ్జిగ, తాగునీరు, చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం డిమాండ్ చేశారు. స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో ఉపాధి హామీ చట్ట ప్రతిష్ట అమలు కోసం కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంఘం మండల కార్యదర్శి ఎ.ప్రభాకర అధ్యక్షత వహించగా ఎం.జీవరత్నం మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పని ప్రదేశాల్లో చలువ పందిళ్లు, మజ్జిగ, తాగునీరు, మెడికల్ కిట్లు సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారని విమర్శించారు. ఒకపక్క ఎండలు 40 డిగ్రీల పైనే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నా కూలీలు ఎండలో పనిచేస్తున్నా అకారులు కన్నెత్తి చూడలేని స్థితిలో ఉన్నారని అన్నారు. పలుమార్లు అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినప్పటికీ నేటికీ ఉపాధి పని ప్రదేశాల్లో సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. ఉపాధి పని ప్రదేశాల్లో కూలీలు నీడ లేక వడదెబ్బతో మృతి చెందుతున్నారని వాపోయారు. పే స్లిప్‌లు ఇవ్వాలని కూలీలు అధికారులకు మొర పెట్టుకున్నప్పటికీ మండలంలోని రెండు గ్రామాలకే ప్లే స్లిప్‌లు ఇచ్చారని తెలిపారు. మిగతా గ్రామాలకు ఎందుకు ఇవ్వలేదని అధికారులను ప్రశ్నించారు. గతేడాది పాత బకాయిలు కూలీలకు అందలేదని దరఖాస్తులు పెట్టినప్పటికీ బ్యాంకులో ఆధార్ కార్డులు లింకులు సరిలేక ఇవ్వలేకపోయామని చెప్పారు. నేటికీ ఆ డబ్బులు ఇవ్వడంలో అధికారులు శ్రద్ధ చూపటం లేదన్నారు. కొన్ని గ్రామాల్లో యంత్రాలతో చెరువుల్లో మట్టి తోలకాలకు పాల్పడుతున్నారని, ఉపాధి హామీ పని చేసే చెరువుల్లో మట్టి తోలకాల నిర్మూలించాలని అధికారులకు దరఖాస్తులు పెట్టినప్పటికీ ఫలితం లేదన్నారు. ఇప్పటికైనా ఎంపిడిఒ, ఎపిఒలు ఉపాధి హామీ సమస్యలపై స్పందించి పరిష్కారం కోసం కృషి చేయాలని కోరారు. లేకపోతే మండలంలోని ఉపాధి హామీ కూలీలందరిని ఐక్యం చేసి ఎంపిడిఒ కార్యాలయాన్ని ముట్టడిస్తామని అధికారులను హెచ్చరించారు.



మాట్లాడుతున్న నాయకులు

పోల్‌రాజ్ కెనాల్ గట్ల గండ్లు పూడ్చివేత

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లిలోని పోల్‌రాజ్ కాల్వ గట్లపై ఏర్పడిన గండ్లను పూడ్చివేత, కాల్వ గట్టుపై జంగిల్ క్లియరెన్స్ పనులకు ముదినేపల్లి సెక్షన్ జలవనరుల శాఖ అధికారులు శ్రీకారం చుట్టారు. రైతులు పశువులను కాల్వలోకి దింపడం కారణంగా, నీటి ఒరవడికి కాల్వ గట్లు కోతకు గురయ్యాయి. మూడు కిలోమీటర్ల మేర అక్కడక్కడ కాల్వ గట్టుపై గండ్లు ఏర్పడడంతో కాల్వ గట్టు మట్టి జారి కాల్వలోకి చేరుకుంటుంది. అంతేకాక కాల్వగట్టుపై దట్టంగా ముళ్ల చెట్లు, పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. దీంతో కాల్వగట్లు పటిష్టం చేసేందుకు, గట్లపై ముళ్లకంపలు తొలగించేందుకు పొక్లెయిన్‌తో పనులు చేపట్టారు. ఆపరేషన్ అండ్ మెటినెన్స్ కింద గురజ నుంచి ముదినేపల్లి వంతెన వరకు మూడు కిలోమీటర్లు, అదేవిధంగా మండవల్లి మండలంలో మరో మూడు కిలోమీటర్లు మొత్తం ఆరు కిలోమీటర్ల మేర కాల్వ గండ్లు పూడ్చివేత, జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టినట్లు ముదినేపల్లి సెక్షన్ ఎఇఇ వికెవి.కిషోర్ తెలిపారు. ఈ పనులకు సూమారు రూ.7 లక్షల వరకు నిధులు వెచ్చించినట్లు ఆయన తెలిపారు.

గండ్లు పూడ్చివేత పనులు చేస్తున్న పొక్లెయిన్

ముందే హెచ్చరించిన ప్రజాశక్తి

పోల్‌రాజ్ కాల్వ గట్లు బలహీనంగా ఉన్నాయని, గండ్లు పడే అవకాశం ఉందని ప్రజాశక్తి గత ఏప్రిల్‌లో పలు కథనలు ప్రచురించింది. కాల్వలో సాగునీరు కాల్వ సామర్థ్యానికి మించి ప్రవాహించడం కారణంగా గట్లకు గండ్లు పడి కాల్వ ఆయుకట్టు రైతులు పంటలు నష్టపోయ్యే ప్రమాదం ఉందంటూ వార్త కథనాల్లో పేర్కొంది. ముఖ్యంగా ముదినేపల్లిలో కాల్వ గట్ల అంచులను నీరు తాకుతూ ఉందని, దీంతో గండ్లు పడే పరిస్థితి ఉందంటూ కథనాలు ప్రచురించింది. ఎట్టకేలకు అధికారుల స్పందించి రెండు నెలల తర్వాత కాల్వ గట్లుకు ఏర్పడ్డ గండ్లను పటిష్టం చేసే పనులు ప్రారంభించారు.

సత్యనారాయణకు రిలీవింగ్ ఆర్డర్ ఇవ్వాలని వినతి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు నగరపాలక సంస్థలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న వంగపండు వెంకట సత్యనారాయణను బదిలీ చేస్తూ మే 31న ఇఎన్‌సి (పిహెచ్) గుంటూరు వారు ప్రొసీడింగ్ ఆర్డర్ ఇచ్చినప్పటికీ ఇప్పటివరకూ ఏలూరు కమిషనర్ రిలీవింగ్ ఆర్డర్ ఇవ్వకపోవడంపై ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ (ఎఐటియుసి) నాయకులు బుధవారం ఇన్‌ఛార్జి కమిషనర్ సిహెచ్.బాపిరాజును కలిసి తక్షణమే రిలీవింగ్ ఆర్డర్ ఇవ్వాలని వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవ అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి.నాగేశ్వరరావు, ఎ.అప్పలరాజు మాట్లాడుతూ ఎపి విజిలెన్స్ మాన్యువల్ వాల్యూం 11 సర్క్యుల్ నెంబర్ 351 ప్రకారం ఎసిబి ట్రాప్‌లో కేసు నమోదైన ఉద్యోగి తిరిగి అదే స్థానంలో, అదే ఊరిలో ఉద్యోగం చేయడానికి ఆస్కారం లేదని, అయినప్పటికీ వంగపండు వెంకట సత్యనారాయణ ఏలూరులోనే కొనసాగుతున్న నేపథ్యంలో ఆయనను తక్షణమే బదిలీ చేయాలని ఎఐటియుసి అనేక విజ్ఞప్తులు, ఆందోళనలు చేసిన నేపథ్యంలో ఇఎన్‌సి ఎట్టకేలకు మే 31న తాడేపల్లిగూడేనికి బదిలీ చేసిందని వారు తెలిపారు. వంగపండు వెంకట సత్యనారాయణ తనకున్న స్థాన బలం, ఆర్థిక బలంతో రిలీవింగ్ కాకుండా ఏలూరులోనే కొనసాగేందుకు అనేక ప్రయత్నాలు చేస్తున్నట్లు యూనియన్ దృష్టికి వచ్చిందని తెలిపారు. ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉండటమే కాకుండా ఏలూరు నగరపాలక సంస్థలో ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న కింది స్థాయి ఉద్యోగ సిబ్బంది పట్ల బాధ్యత రాహిత్యంగా అసభ్యకరంగా దురుసుగా ప్రవర్తిస్తున్న వంగపండుపై చర్యలు తీసుకోవాలని ఎఐటియుసి నాయకులు గుంటూరు ఇఎన్‌సికి, ఏలూరు కార్పొరేషన్ కమిషనర్‌కి, ఏలూరు మేయర్‌కు అనేక పర్యాయాలు విజ్ఞాపనలు, విన్నపాలు, వినతిపత్రాలు అందించినట్లు నాయకులు తెలిపారు. వంగపండు వెంకటసత్యనారాయణకు వెంటనే రిలీవింగ్ ఆర్డర్ ఇవ్వాలని, లేకపోతే ఎఐటియుసి నాయకత్వంలో మళ్లీ ఉద్యమిస్తామని వారు ఇన్‌ఛార్జి కమిషనర్‌కు విన్నమించారు. ఇన్‌ఛార్జి కమిషనర్‌ను కలిసిన వారిలో యూనియన్ కోశాధికారి బి.నారాయణరావు యూనియన్ నాయకులు ధనాల అప్పారావు పాల్గొన్నారు.

నష్టపోయిన అరటి, ఆయిల్ పామ్ రైతులను ఆదుకోవాలి

రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.లింగరాజు

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ఈ నెల నాలుగో వచ్చిన ఈదురు గాలుల వల్ల నష్టపోయిన అరటి, ఆయిల్‌పామ్ రైతులకు నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.లింగరాజు డిమాండ్ చేశారు. బుధవారం సాయంత్రం ఎం.నాగులపల్లి, నారాయణపురం గ్రామాల్లో పర్యటించి ఈదురు గాలుల వల్ల నష్టం జరిగిన పంటలను రైతు సంఘం, సిపిఎం నాయకులు పరిశీలించారు. నష్టం వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్, ఆర్.లింగరాజు మాట్లాడుతూ ఇక్రాప్‌తో నిమిత్తం లేకుండా పంట నష్టాలను నమోదు చేసి నష్టపరిహారం ఇచ్చి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కట్టా భాస్కరరావు, బాధిత రైతులు వీరవల్లి శ్రీనివాసరావు, గురజాల వెంకటరావు పాల్గొన్నారు.

అరటి తోటలను పరిశీలిస్తున్న నాయకులు

18న తాడేపల్లిగూడెంలో ఆర్యవైశ్యుల ఆత్మీయ సమ్మేళనం

సమాయత్త ఏర్పాట్లపై కైకరంలో నాయకుల సమావేశం

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఆర్యవైశ్యుల ఆత్మీయ సమ్మేళనం ఈ నెల 18వ తేదీన తాడేపల్లిగూడెంలో నిర్వహించనున్నామని జిల్లా అధ్యక్షుడు కోనా శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని కైకరంలో కోనా శ్రీనివాసరావు అధ్యక్షతన ఆర్యవైశ్యుల ముఖ్య నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కోనా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో ఉన్న ఆర్యవైశ్యులంతా హాజరయ్యేలా సమాయత్త ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ముఖ్యంగా ఈ సమావేశంలో ఆర్యవైశ్యులకు రాజకీయంగా ప్రాధాన్యత కల్పించాలని, చట్ట సభల్లో తగిన ప్రాధాన్యత ఇవ్వాలని, కిరాణా దుకాణాల్లో బెల్లం అమ్ముతున్నారనే సాకుతో కేసులు పెట్టి అరెస్టు చేసేందుకు కారణమైన ఎక్సైజ్ చట్టం సవరించాలనే అజెండాతో సమావేశం నిర్వహించనున్నామని తెలిపారు. కీర్తిశేషులు మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య విగ్రహాలను ప్రతి మండల కేంద్రంలో తన సొంత ఖర్చులతో ఏర్పాటు చేయనున్నట్లు కోనా శ్రీనివాసరావు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నిరామ సత్యనారాయణ, నుదురుపాటి శ్రీను, గూడవల్లి శ్రీనివాస్, శ్రీకాకుళపు ఆంజనేయులు, మద్దుల సోమరాజు, గ్రంధి బాపూజీ, నాళం శ్రీను, జల్లిపల్లి శివాజీ, కొత్త పుల్లేశ్వరరరావు, నారాయణం హనుమంతురావు, కోరుమామిడి కాశీ పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి దాతల సాయం అభినందనీయం

ప్రజాశక్తి - భీమడోలు

గుండుగొలను జిల్లా పరిషత్ పాఠశాల అభివృద్ధికి సహకరించేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయురాలు కె.అనంతలక్ష్మి తెలిపారు. పాఠశాలకు సమీపంలో సింగవరం కేంద్రంగా పనిచేస్తున్న లాక్టాలీస్(తిరుమల) మిల్క్ ప్రొడక్ట్స్ కంపెనీ వారు పాఠశాలలో కంప్యూటర్ల విద్యను అభివృద్ధి పరిచేందుకు రూ.8 లక్షల విలువైన పది కంప్యూటర్లు, పది ఎగ్జిక్యూటివ్ కుర్చీలు, పది టేబుళ్లను అందించారు. బుధవారం పాఠశాలలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో వీటిని దాతలు నుంచి ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయురాలు స్వీకరించారు. సదరు కంప్యూటర్ల వ్యవస్థను పాఠశాలకు చెందిన తల్లిదండ్రుల కమిటీ సభ్యులు ఎస్.మాధవ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో లాక్టాలీస్ కంపెనీ హెడ్ లారెన్స్, డైరెక్టర్‌తో పాటు ఫ్రెడ్రిక్‌తో పాటు ప్లాంట్ మేనేజర్ అమిత్ పాల్గొన్నారు.

కంప్యూటర్ల ద్వారా విద్య నేర్చుకుంటున్న విద్యార్థులు

మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లాలి : టిడిపి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

మహానాడు వేదికగా టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు భవిష్యత్తుకు గ్యారెంటీ పేరుతో విడుదల చేసిన తొలివిడత మ్యానిఫెస్టోపై చర్చా వేదిక కార్యక్రమం బుట్టాయగూడెంలోని టిడిపి నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాసులు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అన్ని మండలాల నాయకులు, కార్యకర్తలు, క్లస్టర్, యూనిట్, బూత్ కన్వీనర్లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బొరగం శ్రీనివాసులు మాట్లాడుతూ మ్యానిఫెస్టోని ప్రతి గ్రామంలో ప్రజల వద్దకు తీసుకెళ్లాలన్నారు. జగన్ పాలనలో రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. మహిళలకు మహాశక్తి పేరుతో ఆడబిడ్డ నిధి కింద 18 నుంచి 59 సంవత్సరాలు వారు ఎంతమంది ఉన్నా నెలకు రూ.1500, తల్లికి వందనం పథకం పేరుతో కుటుంబంలో ఎంతమంది చదువుకునే పిల్లలు ఉన్నా వారందరికీ సంవత్సరానికి రూ.15 వేలు, దీపం పథకం కింద సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఆర్‌టిసి బస్సు ఉచిత ప్రయాణం, యువగళం పథకం కింద నిరుద్యోగ యువతకు నెలకు రూ.మూడు వేలు, 20 లక్షల ఉద్యోగాలు, రైతులకు అన్నదాత పథకం కింద ప్రతి రైతుకు సంవత్సరానికి రూ.20 వేలు ఆర్థిక సహాయం, బిసిలకు రక్షణ చట్టం, ఇంటింటికి మంచినీరు, పూర్ టూ రిచ్ పథకం కింద ఐదెళ్లలో పేదలను సంపన్నులు చేయటం ఇలా మ్యానిఫెస్టో గురించి ప్రజల్లో చర్చ జరిగేలా బాధ్యతగా అందరూ వివరించాలని దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు జయవరపు శ్రీరామ్మూర్తి, శీలం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

8, 9 తేదీల్లో ఆధార్ నమోదు శిబిరం

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు పట్టణంలోని ఎంప్లాయిస్ కాలనీ సచివాలయంలో ఈ నెల 8,9 తేదీల్లో ఆధార్ క్యాంపెయినింగ్ నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ సయ్యద్ అబ్దుల్ రషీద్ తెలిపారు. ఆధార్ కార్డుకు ఫోన్ నెంబర్ అనుసంధానం, జిల్లా మార్పు, తదితర సవరణలు చేసుకోవచ్చని చెప్పారు. ఈ అవకాశాన్ని ఎంప్లాయిస్ కాలనీ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ విజ్ఞప్తి చేశారు.



కూలర్‌ను అందిస్తున్న సత్యనారాయణ

'అమ్మ ప్రేమ' కూలర్ అందజేత

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

స్థానిక అమ్మ ప్రేమ స్వచ్ఛంద సేవా సంస్థకు సూర్య ఎలక్ట్రానిక్స్ అధినేత, నూకాలమ్మ ఆలయ కమిటీ ఛైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ కూలర్‌ను ఉచితంగా అందించారు. వేసవి ఎండల తీవ్రత అధికంగా ఉన్న కారణంగా అమ్మ ప్రేమ స్వచ్ఛంధ సేవా సంస్థ పిల్లల కోసం కూలర్ అవసరం ఉందని ఆశ్రమం నిర్వాహకురాలు రోజారమణి తెలియచేయగా వెంటనే స్పందించి కూలర్‌ను ఉచితంగా అందించామని తెలిపారు. ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వాహకురాలు రోజా రమణి, పిల్లలు దాత రాజాన సత్యనారయణకు కృతజ్ఞతలు తెలిపారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.1,01,116 విరాళం

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ద్వారకాతిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శాశ్వత నిత్యాన్నదాన ట్రస్టుకు సూర్యచంద్రరావుపేటకు చెందిన పాకలపాటి గోపాలకృష్ణ బుధవారం ఉదయం రూ.1,01,116 విరాళం అన్నదాన సూపరింటెండెంట్ ఐ.రమణరాజుకు అందించారు. అనంతరం దాత కుటుంబ సభ్యులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. వీరికి దేవస్థానం వారు అన్నదానం బాండ్ పేపర్స్ అందించారు.

In the Court of the Principal Junior Civil Judge, Tadepalligudem
O.S. 76/2023

Between:
Union Bank of India, Tadepalligudem
Rep. by its Chief Manager ...*Plaintiff*
AND
1. M/s. Balaji Dresses, Rep. by its Prop: Chappati Padmaja.
2. Chappati Padmaja ...*Defendants*

ప్రకటన

యిందుమూలముగా మీకు తెలియజేయునది ఏమనగా, పై నంబరు గ్రంధములో శ్రీ కోర్టు వారు జారీ చేసిన సమన్లు త్రిప్పి పంపుచున్నందున పై నంబరు గ్రంధములో Substitute Service ద్వారా మీకు పేపరు ప్రకటన మూలముగా తెలియజేయునది ఏమనగా, పై నంబరు గ్రంధము **ది. 16-6-2023న వాయిదా అయి ఉన్నది. మీరు గాని, మీ తరపు ప్లీడరు గారి ద్వారా గాని ది. 16-6-2023న ఉదయం 10.30 ని॥లకు** పై శ్రీ కోర్టు వారి ఎదుట హాజరు కావలసినది. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించడం జరుగునని ఈ ప్రకటన మూలముగా తెలియజేయడమైనది.

M.A.V.L.N.ACHARYULU
Advocate, Tadepalligudem
Cell: 9963230864

ప్రకటన
మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S. No. 128/2010

Between:
శ్రీధర బుచ్చి రామలింగేశ్వరరావు వగైరా **-వాదులు**
Vs
స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా, పిప్పర, వగైరా **-ప్రతివాదులు**

పై నెంబరు దావాలో రెండవ ప్రతివాది శ్రీధర కాశీ వర విశ్వేశ్వరరావు గారు ది. 28-03-2020వ తేదీన ఇంటేస్టేట్‌గా చనిపోయినందున వారికి వారసులైన ఏడవ ప్రతివాది శ్రీమతి శ్రీధర విశాలాక్షి, భర్త: శ్రీధర కాశీ వర విశ్వేశ్వరరావు, డోర్ నెం. 5-133, వి.టి.ఛానల్ రోడ్, పైడిపర్రు, తణుకు మండలం మరియు తొమ్మిదవ ప్రతివాది శ్రీధర గురుప్రసాద్, తండ్రి: శ్రీధర కాశీ వర విశ్వేశ్వరరావు, డోర్ నెం. 5-133, వి.టి.ఛానల్ రోడ్, పైడిపర్రు, తణుకు మండలం అనువారు పై నెంబరు దావాలో కోర్టు ద్వారా ఎన్నిమార్లు దావా సమన్లు పంపినప్పటికీ తీసుకొననందున / evade చేయుచున్నందున శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు మేరకు యీ ప్రకటన ఇవ్వడమైనది. కావున సదరు ఏడవ ప్రతివాది శ్రీమతి శ్రీధర విశాలాక్షి మరియు తొమ్మిదవ ప్రతివాది శ్రీధర గురుప్రసాద్ అనువారు **ది. 23-06-2023వ తేదీన ఉదయం గం॥ 10.30 నిమిషములకు** పైన తెలిపిన కోర్టులో స్వయంగా గాని, అడ్వకేట్ ద్వారా గాని హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల పరోక్షమున తీర్మానించబడునని తెలియపరచడమైనది.

తాడేపల్లిగూడెం **ధూళిపాళ సూర్య రామారావు**
తేది:05-06-2023 వాదులు తరపు న్యాయవాది

MUNICIPAL CORPORATION, ELURU

e-PROCUREMENT TENDER NOTICE No: 128-130/General/2023-24, Dated: 07-06-2023.

The Commissioner, Municipal Corporation, Eluru invites tenders from interested, eligible bidders for **"Supply Delivery Commissioning and Testing of Public Addressing System and PTZ Cameras, Illumination of JB Park and Engaging JCB & Labour for sanitation at various places in Municipal Corporation, Eluru"** Total No. of works is **3** with an amount of Rs. **14.71** Lakhs.

Tender schedules are available on e-procurement market place from 08-06-2023. Last date of receipt of tenders is 15-06-2023. Further details can be seen at e-procurement market place at **www.apeprocurement.gov.in** or contact Commissioner, Municipal Corporation, Eluru, Eluru District (Phone/ Fax: 08812-245990).

Sd/- **COMMISSIONER**
MUNICIPAL CORPORATION, ELURU